సాక్షి
పల్నాడు
బుధవారం । 8 । అక్టోబర్ । 2025



మర్యాదపూర్వక కలయిక

నరసరావుపేటటౌన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ్ చక్రవర్తిని పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 75,430 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 0,430 క్యూసెక్కులు వదులుతున్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: సుబ్బారాయుడి సన్నిధిలో నిత్యాన్నదానానికి బాపట్ల జిల్లా పేరావళికి చెందిన దాది వివేకానందస్వామి, సీతామహాలక్ష్మి దంపతులు రూ. 1,00,108ను విరాళంగా సమర్పించారు.

న్యూస్‌రీల్

నృసింహుని ఆదాయం రూ.48.45 లక్షలు



మంగళగిరిటౌన్: మంగళగిరిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి హుండీ కానుకలను మంగళవారం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. ఎగువ, దిగువ సన్నిధులు, ఘాట్‌రోడ్‌లోని పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలకు మొత్తం రూ.48,45,565 ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలో కంటే రూ.2,94,429 అధికంగా వచ్చినట్లు వివరించారు. లెక్కింపు కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా పొన్నూరు శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి వారి దేవస్థాన కార్యనిర్వహణాధికారి జి.వి.అమర్‌నాథ్ పర్యవేక్షించారు.

పీజీ సోషల్ వర్క్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(పెదకాకాని): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. 13 మందికి 11 మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేవారు ఒక్కో పేపరుకు రూ.1,860 ఈనెల 17వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

బీటెక్ సప్లిమెంటరీ ఫలితాలు..

వర్సిటీ పరిధిలో బీటెక్ 3/4 మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను సీఈ శివప్రసాదరావు విడుదల చేశారు. 132 మందికి 87మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ కోసం ఒక పేపరుకు రూ.2070 ఈనెల 17వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించిన జేసీ



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి శివారు ఎన్నాదేవి వద్ద గల 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే మంగళవారం సందర్శించారు. 400 కేవీ సబ్‌స్టేషన్ అలియనేషన్‌లో భాగంగా ట్రాన్స్‌కోకు కేటాయించేందుకు ప్రతిపాదించిన 14.92 ఎకరాల స్థలాన్ని ఆయన క్షేత్రస్థాయి తనిఖీ చేశారు. ఆయనతోపాటు సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణా కాంతరెడ్డి, తహసీల్దారు కేఎస్ చక్రవర్తి తదితరులు ఉన్నారు.

రంగా వర్సిటీలో వాల్మీకి జయంతి



గుంటూరురూరల్: గుంటూరు నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆదికవి వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంపీ రమణ వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం జాయింట్ రిజిస్ట్రార్ ఎం. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూ కాంట్రాక్ట్ అధ్యాపకులకు నోటీసులు

ఏఎన్‌యూ(పెదకాకాని): ఏఎన్‌యూలో కాంట్రాక్ట్ అధ్యాపకులకు నోటీసులు అందినట్లు విశ్వసనీయ సమాచారం. కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న నలుగురు, దూరవిద్యలో పనిచేస్తున్న ఇద్దరు అకడమిక్ కౌన్సెలర్లకు సెప్టెంబరు 29న ఈ మెయిల్ ద్వారా వర్సిటీ అధికారులు సమాచారం అందించారు. కొద్ది నెలల క్రితం 60 ఏళ్లు పూర్తయిన వారిని తొలగిస్తూ వర్సిటీ ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు సూచనల మేరకు సెప్టెంబరు 30 వరకు విధుల్లో కొనసాగారు. తాజాగా సెప్టెంబరు 29న వర్సిటీ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఇదే కేటగిరిలో సుమారు 11 మంది ఉండగా వారిలో ఆరుగురికి మాత్రమే నోటీసులు అందాయి.

దుష్ప్రచారంతోనే ఓటమి

- పచ్చ మీడియాతో కావాలనే విష ప్రచారం చేశారు
- అలవికాని హామీలు ఇచ్చి మూడు పార్టీలు అధికారంలోకి వచ్చాయి
- సంపద సృష్టి కేవలం కూటమి నేతలు, కార్యకర్తలకే
- మనం అభివృద్ధి చేస్తే వారు ప్రైవేటీకరణ చేస్తున్నారు
- రానున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కార్యకర్తలే పాలిస్తారు
- వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్ వై.వీ. సుబ్బారెడ్డి
- హాజరైన జిల్లా సమన్వయకర్తలు, ముఖ్యనేతలు, కార్యకర్తలు



వేదికపై జిల్లా కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, పి.గౌతమ్‌రెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, విడదల రజిని, నంబూరు శంకరరావు, కాసు మహేష్‌రెడ్డి, సుధీర్ భార్గవ్‌రెడ్డి తదితరులు

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట: కూటమి నేతలు, పచ్చ మీడియా చేసిన దుష్ప్రచారమే గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమికి ప్రధాన కారణమని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వీ.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నరసరావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యకర్తలను ఉద్దేశించి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రజలకు ఎంతో మేలు చేసిందని, అయితే వాటిని మరుగునపెట్టి కావాలనే కూటమి నేతలు విషప్రచారం చేశారన్నారు. మరోవైపు మూడు పార్టీలు కలసి వచ్చి అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలను నిండా మోసం చేస్తున్నారన్నారని ధ్వజమెత్తారు. సంపద సృష్టిస్తామని చెప్పిన చంద్రబాబు తాను, తన పార్టీ వారికి మాత్రమే సంపద చేరుతోందన్నారు. మనం మెడికల్ కళాశాలలు, పోర్టులు, ఆసుపత్రులు నిర్మిస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేసి దోచుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టాలని, ప్రతి గ్రామం నుంచి కనీసం 500 మందితో సంతకాలు చేయించాలన్నారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ర్యాలీలను, రచ్చబండలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కష్టపడిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని, వారికే ప్రాధాన్యం ఇస్తామన్నారు. రానున్న ప్రభుత్వాన్ని వైఎస్సార్ సీపీ కార్యకర్తలే నడిపిస్తారన్నారు. కేసులకు భయపడాల్సిన పనిలేదన్నారు. పార్టీ అండగా నిలుస్తుందన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం కమిటీలు ఎంతో కీలకమని, పారదర్శకంగా నియామకాలు చేపట్టాలన్నారు. నవంబర్ 20 నాటికి అన్ని కమిటీలు పూర్తి కావాలన్నారు. నకిలీ మద్యం, బెల్టుషాపులతో కూటమి నేతలు ప్రజల ప్రాణాలను తీస్తున్నారన్నారు. నకిలీ మద్యంపై రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, ఎస్ఈసీ మెంబర్లు ఈదా సాంబిరెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు యెనుముల మురళీధర్‌రెడ్డి, పడాల శివారెడ్డి, రేపాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కందుల ఎజ్రా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు ఎన్‌కే ఆంజనేయులు, పాలపర్తి వెంకటేశ్వరావు, కనకా పుల్లారెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఇయం.స్వామి, సీనియర్ నాయకులు గజ్జెల నాగభూషణరెడ్డి, దేవేళ్ల రేవతి, జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, యువత, విద్యార్థి విభాగాల జిల్లా అధ్యక్షులు కందుల శ్రీకాంత్, గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, అంగన్‌వాడీ విభాగ కన్వీనర్ హెల్డా ఫ్లోరెన్స్, నరసరావుపేట, రొంపిచర్ల మండల కన్వీనర్లు తన్నీరు శ్రీనివాసరావు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట పట్టణ అధ్యక్షులు షేక్ కరీముల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్సనల్ శాఖగా పోలీసులు

పోలీసు శాఖను పర్సనల్ డిపార్టుమెంట్‌గా తయారుచేసి వైఎస్సార్ సీపీ వారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లపాలు చేస్తున్నారు. జిల్లా మొత్తం కార్యకర్తలు ఉత్సాహంగా ఉండటంపై కూటమి నాయకులు భయపడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ గెలవటం గ్యారెంటీ అని, అప్పుడు వారికి జగన్ 2.0 పాలన చూపిస్తాం. పోలీసులను చూసి భయపడే స్టేజ్ దాటిపోయిందని, ప్రతి ఒక్కరిపై కేసులు ఉన్నాయి.

–డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలుచేసినా వైఎస్సార్ సీపీ ఓడిపోవటానికి కారణం కార్యకర్తలను పూర్తిస్థాయిలో పట్టించుకోకపోవటమే. అయితే ఓడిన మూడు నెలలకే ప్రజల్లోకి వచ్చిన ఏకైక పార్టీ మనదేనని చెప్పారు. అవినీతి, అక్రమాలతో అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రజావ్యతిరేకతను కూటమి ప్రభుత్వం మూటగట్టుకుంది. విద్య, వైద్యరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసి బస్సుల సంఖ్య పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–నంబూరు శంకరరావు, మాజీ ఎమ్మెల్యే పెదకూరపాడు

నకిలీపై మహిళలు ఉద్యమించాలి

ప్రభుత్వ అరాచకం, దౌర్జన్యాలకు నిరసనగా ప్రజలు బయటకు రావాలి. నకిలీ మద్యానికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలి. రాష్ట్రానికి జగనే దిక్సూచీ అని, కూటమి ప్రభుత్వం కూలిపోవటం ఖాయమని, జగన్ వెంట ప్రతి ఒక్కరూ నడవాలి. జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కటాన్ని విమర్శించిన చంద్రబాబు మొన్న ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం చేయటంలో తాను కూడా బటన్ నొక్కాడు. అయితే వారిని మోసం చేశాడు. సుమారు 15 లక్షల మంది ఆటోవాలాలు, కాబ్, లారీ డ్రైవర్లు ఉంటే 18 నిబంధనలు పెట్టి 2.96లక్షల మందికి ఇచ్చి చేతులు దులుపుకున్నాడు.

–పూనూరి గౌతమ్‌రెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు

నకిలీ మద్యంపై పోరాటం

రాష్ట్రంలోని కూటమి నాయకులు చేస్తున్న నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోరాటంచేయాలి. ప్రతిరోజూ రూ.45 కోట్ల వరకు నకిలీ మద్యం తయారు చేసి బెల్టుషాపుల ద్వారా ప్రజలకు పంపిణీ చేశారు. ఇప్పటివరకు సుమారు రూ.5,200 కోట్లు అక్రమ మద్యంపై సంపాదించారు. ప్రశ్నించటానికే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పుకునే పవన్ కల్యాణ్ రాష్ట్రంలో వెలుగుచూసిన అక్రమ మద్యం తయారీపై ఎందుకు మాట్లాడటం లేదు. తాను అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కళాశాలలతోపాటు ప్రభుత్వ భూములు అప్పనంగా ప్రైవేటు వారికి, తన అనుయాయులకు కట్టబెట్టి దోచుకుంటున్నారు. రైతులకు అవసరమైన యూరియాని సైతం అమ్ముకుంటున్నారు. కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలు, అన్యాయాలు, అక్రమ కేసులపై ఎవరికి వారు డిజిటల్‌బుక్‌లో నమోదు చేయాలి.

–డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్టీ కార్యనిర్వాహక జిల్లా అధ్యక్షులు

కష్టానికి తగ్గ ప్రతిఫలం అందజేస్తాం

కష్టపడిన కార్యకర్తలను పార్టీ గుర్తుపెట్టుకుంటుంది. కష్టానికి తగిన ప్రతిఫలం తప్పకుండా అందజేస్తాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, డాక్టర్లు, రైతులు రోడ్డు ఎక్కితే సూపర్‌సిక్స్ డూపర్ హిట్ ఎలా అవుతుంది. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాడమాడుతున్నారని, ప్రజలను దోచుకోవటమే ధ్యేయంగా పరిపాలన చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించటంలో పల్నాడు జిల్లా పోలీసులు ప్రత్యేకంగా వ్యవహరిస్తున్నారు. వైద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆరోగ్యశ్రీని వదిలేశారని, జబ్బులు చేసిన ప్రజలు ఆదుకునే దిక్కులేక అల్లాడుతున్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ నిర్వాహించేందుకు పార్టీ నిర్ణయించిందని, దీనికి ప్రజలు, కార్యకర్తలందరూ సహకరించాలి.

– విడదల రజిని, మాజీ మంత్రి

నమ్మి ఓటేస్తే మోసగించిన బాబు

పార్టీలో ఎవరికి ఆపద వచ్చినా ప్రతి ఒక్కరూ స్పందించాల్సిన అవసరం ఉంది. జగన్ ఉండి ఉంటే బాగుండేదనే ఆలోచన ప్రజలు ఇప్పుడు చేస్తున్నారు. ప్రభుత్వ అక్రమాలపై పోస్టులు పెడుతున్న పార్టీకి చెందిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేస్తున్నారు. తాట తీస్తా అన్నందుకు తనపైన అక్రమ కేసు పెట్టారని, దీనికి జవాబుగా ఒకటికి మూడు కేసులు పెడతాం. కార్యకర్తలను కొట్టిన పోలీసు అధికారులకు తమ ప్రభుత్వంలో సస్పెన్షన్లు, డిస్మిస్‌లు ఎదుర్కోవాల్సివస్తుంది. అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఇంటింటి సమస్యలు తెలుసుకొని పరిపాలించినా ఓటమి ఎదురుకావటంపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. చంద్రబాబు చెప్పిన అబద్దాలు నమ్మి అతనికి ఓటు వేశారని, అయితే వారందరిని బాబు మోసం చేశాడు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తుల నుంచి వెనక్కు తీసుకుంటాం.

–కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గురజాల

ప్రమాదకరంగా బీబీసీ కెనాల్ డ్రాప్

- ఇప్పటి వరకు ప్రాణాలు కోల్పోయిన వారు పది మంది
- డ్రాప్ వద్ద రక్షణ చర్యలు శూన్యం
- పట్టించుకోని కెనాల్స్ అధికారులు



తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న బీబీసీ కెనాల్ డ్రాప్

నకరికల్లు: బెల్లంకొండ బ్రాంచి కెనాల్‌పై త్రిపురాపురం వద్ద ఉన్న డ్రాప్ ప్రమాదకరంగా మారింది. డ్రాప్ వద్ద నీటి ఉధృతి అధికంగా ఉండడంతో ఈత కొట్టేందుకు, వాహనాలు శుభ్రం చేసుకునేందుకు వచ్చే వారు ప్రమాదం బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటి వరకు సుమారు 10 మంది ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. డ్రాప్‌కు ఇరువైపులా కట్ట బలహీనంగా ఉంటుంది. స్థానిక యువకులు ఈత కొట్టేందుకు, ట్రాక్టర్‌లు, ఆటోలు శుభ్రం చేసుకునేందుకు వస్తుంటారు. అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీ డ్రైవర్‌లు, క్లీనర్ స్నానాలు చేసేందుకు దిగుతుంటారు. డ్రాప్ సమీపంలో లోతు ఎక్కువగా ఉండడం, నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడం, కట్ట మట్టి జారుతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు సంభవిస్తున్న ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం గాని కట్ట బలహీనంగా ఉన్నచోట జారకుండా చూడడం, ప్రమాదాలు సంభవిస్తున్న చోట ఎవరూ దిగకుండా చూడడం వంటి నివారణ చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వాల్మీకి రామాయణం మానవాళికి అనుసరణీయం



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట: మహాకవి వాల్మీకి మహర్షి త్రేతాయుగంలో రచించిన రామాయణం మానవాళికి అనుసరణీయమైన చాలా గొప్ప కావ్యమని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి అందరివాడని, వాల్మీకి జయంతి ఏ ఒక్క వర్గానికి చెందినదో కాదని, అందరూ నిర్వహించుకోవాల్సిన పండుగని అన్నారు. వాల్మీకి బోయ సోదరులకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఆర్ఓ ఏకా మురళి, రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం డైరెక్టర్ గంగాధర్, డీబీసీడబ్లు ఈఓ సంతోష్ కుమార్, బీజేపీ అధికార ప్రతినిధి రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలకు ఈకేవైసీతో చెక్

- మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌లో వివరాలు నమోదు
- ఈకేవైసీ చేయించుకోని వేతనదారులకు పని నిల్
- జిల్లాలో ఉపాధి వేతనదారులు 6.05 లక్షలు



వేతనదారుల ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తున్న సిబ్బంది



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సత్తెనపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉన్న వేతనదారులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తమ ఆధార్ కార్డును జాబ్‌కార్డుతో అనుసంధానం చేసుకుంటేనే పనికల్పించాలని నిర్ణయించింది. ఈకేవైసీ నమోదు ప్రక్రియ కోసం ఎంజీఎన్‌ఆర్ ఇజీఎస్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టింది. ఉపాధి వేతనదారుల ఆధార్ వివరాలు నమోదు చేసి ముఖ గుర్తింపు ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీనికోసం వేతనదారులు తమ ఆధార్, జాబ్ కార్డులతో స్వగ్రామంలోని ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదిస్తే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తారు. అయితే ఆధార్ కార్డును వేతనదారులు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకొని ఉండాలి. ఈకేవైసీ ప్రక్రియ చేయించుకోని వారికి ఇకపై పని కల్పించడం వీలుపడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

పనుల్లో పారదర్శకత కోసమే...

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత లేదనే ఆరోపణలు, నిధులు దుర్వినియోగం చేస్తున్నట్లు తరచూ సోషల్ ఆడిట్‌లో వెల్లడవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. క్షేత్రస్థాయిలో జరిగే అవినీతికి చెక్ పెట్టేందుకు సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించింది. కొత్తగా కేంద్రం తీసుకున్న ఈకేవైసీ విధానంతో పనుల్లో పారదర్శకత పెరుగుతుందని, ఒక జాబ్ కార్డుపై మరొకరు పనిచేసే అవకాశం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో జాబ్ కార్డుదారుల వివరాలు ..

జిల్లాలో జాబ్ కార్డుదారులు:	3.51 లక్షలు
ఉపాధి పనులకు వచ్చే కూలీలు:	6.05 లక్షలు
యాక్టీవ్ జాబ్ కార్డుదారులు:	2.75 లక్షలు
పనులకు వచ్చే యాక్టీవ్ కూలీలు:	4.71 లక్షలు
ఈ ఏడాది పనులకు వచ్చిన కుటుంబాలు:	1.93 లక్షలు
ఈ ఏడాది పనులకు వచ్చిన కూలీలు:	3.25 లక్షలు

ఈ కేవైసీ చేయించుకోవాలి



ఉపాధి హామీ పథకం వేతనదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. నమోదు ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాం. జాబ్ కార్డుతో ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఆదేశాలిచ్చాం. వేతనదారులు ఆధార్ వివరాలను వీలైనంత త్వరగా అప్‌డేట్ చేసుకోవాలి. త్వరలో ఈకేవైసీ పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

–పొత్తూరి వెంకటనారాయణ, ఇన్‌చార్జి ఏపీడీ, సత్తెనపల్లి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- కారు, ద్విచక్ర వాహనం ఢీ
- మరో ముగ్గురికి గాయాలు
- వేములూరిపాడు వద్ద ఘటన
- 108 అందుబాటులో లేక ఆటోలో వైద్యశాలకు తరలింపు

ఫిరంగిపురం: కారు, ద్విచక్రవాహనాలుఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పొనుగుపాడుకు చెందిన రత్నసాగర్(33) భార్య, ఇద్దరు పిల్లలతో కలసి గుంటూరు వెళ్లారు. గుంటూరు–కర్నూలు రాష్ట్ర రహదారిలో ఇంటికి తిరిగివస్తుండగా వేములూరిపాడు వద్ద గుంటూరు వైపు వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. ఘటనలో ఇన్నోవా రోడ్డుకు మరోవైపు వెళ్లింది. రత్నసాగర్‌తో పాటు భార్య, పిల్లలు గాయపడ్డారు. వీరితో పాటు అటువైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహన చోదకుడు గాయపడ్డారు. 108 అందుబాటులో లేక పోవడంతో ఆటోల్లో తరలిస్తుండగా రత్నసాగర్, గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం కారణంగా నిలిచిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.



ప్రమాదంలో మృతిచెందిన వారు

క్లుప్తంగా

మద్యం తాగి గొంతెండి ఒడిశా యువకుడు మృతి

నాదెండ్ల: అతిగా మద్యం తాగి గొంతెండి ఒడిశా యువకుడు (20) మృతి చెందిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న ఒడిశా కార్మికుడు మిల్లు క్వార్టర్స్‌లో నివశిస్తున్నాడు. సోమవారం ఉదయం పూటుగా మద్యం తాగాడు. క్వార్టర్స్‌కి వెళ్లి మత్తులో పడుకున్నాడు. కొద్దిసేపటికి గొంతెండి మృతి చెందాడు. బంధువులు అప్పటికప్పుడే దహన సంస్కారాలు నిర్వహించారు.

బ్యాంకులు నూతన ఆలోచనలను ప్రోత్సహించాలి

నరసరావుపేట: జిల్లాలో మారుతున్న కాలానికి తగ్గట్టు కొత్త ఆలోచనలతో వ్యాపారాలు చేయాలనుకునేవారికి బ్యాంకులు రుణాలు అందించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు సూచించారు. స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు శిక్షణతో పాటు రుణాలు మంజూరు చేస్తే అద్భుతాలు సృష్టించగలరన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో లీడ్ బ్యాంక్ స్కీమ్ జిల్లాస్థాయి త్రైమాసిక సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బ్యాంకులు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా అందించే సబ్సిడీలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నెలకు రెండుసార్లు రుణమేళాలు చేపట్టి రుణ వితరణ చేయాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కె న మల్లికార్జునరావు, ఎల్‌డీఎం కేఎస్ రామ్‌ప్రసాద్, కన్వీనర్ టి.మాధురి, నాబార్డ్ డీడీఎం శరత్, ఇతర బ్యాంక్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు, ఉద్యాన శాఖ అధికారి టి.వెంకట్రావు, పరిశ్రమల శాఖ తరపున నవీన్, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

రైతు ద్విచక్ర వాహనం నుంచి రూ. 3 లక్షలు చోరీ

సత్తెనపల్లి: సినీఫక్కీలో గుట్టుచప్పుడు కాకుండా వెంబడించి రైతు ద్విచక్ర వాహనంలో నుంచి గుర్తు తెలియని దుండగుడు రూ. 3 లక్షలు నగదు కాజేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామానికి చెందిన రైతు బూతుకూరి శ్రీనివాస రెడ్డి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల యూనియన్ బ్యాంకుకు వచ్చాడు. బంగారు నగలు కుదువపెట్టి రూ. 3 లక్షలు నగదు తీసుకున్నాడు. ఆ నగదును ద్విచక్ర వాహనంలో పెట్టుకొని మాచర్ల రోడ్‌లో గల పెద్ద మసీదు ఎదురు గల తిరుమల ఫర్టిలైజర్స్ ముందు ద్విచక్ర వాహనం ఆపి ఆకొట్లో ఎరువులు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. ఎరువులు కొనుగోలు చేసి తిరిగి నగదు కోసం ద్విచక్ర వాహనం వద్దకు రాగా అప్పటికే బ్యాంకు వద్ద నుంచి వెంబడించిన గుర్తు తెలియని దుండగుడు ద్విచక్ర వాహనంలోని నగదును చోరీ చేశాడు. ద్విచక్ర వాహనంలో నగదు లేకపోవడాన్ని గుర్తించిన శ్రీనివాసరెడ్డి లబోదిబోమంటూ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘సజ్జ’తో భూసారం.. అదనపు ఆదాయం

- శనగకు ముందు సజ్జ సాగు ఎంతో మేలు
- ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధన రాష్ట్ర సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ

యడ్లపాడు: పొలంలో శనగ పంట వేయడానికి ముందు ఖాళీగా ఉంచే సమయాన్ని వినియోగించుకుంటూ సజ్జ పంట సాగు చేయడం రైతులకు అదనపు ఆదాయంతో పాటు భూసార వృద్ధికి దోహదపడుతుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ స్పష్టం చేశారు. పల్నాడు ఏరువాక కేంద్రం నిర్వహించిన క్షేత్ర దినోత్సవం, రైతు సదస్సు కార్యక్రమాలు మండలంలోని జాలాది గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో సజ్జసాగు చేస్తున్న రైతు మానుకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ సజ్జపంట సాగు ఎంతో ఆశాజనకంగా ఉందని, ఎకరానికి దాదాపు 15 – 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, తద్వారా నికరంగా రూ. 25 వేల ఆదాయం పొందవచ్చని సదస్సులో రైతులకు వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన ఏబీవీ 04 రకం సజ్జ అధిక దిగుబడులు ఇచ్చే అవకాశం ఉందని జాలాది రైతులు నిరూపించారని తెలిపారు. విస్తరణ విభాగం రాష్ట్ర సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ, నూతన వంగడాల సాగు ద్వారా వ్యవసాయాన్ని వాణిజ్యం దిశగా తీసుకెళ్లవచ్చని ఆయన సూచించారు. సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎన్‌వీఎస్ దుర్గాప్రసాద్, చిరుధాన్యాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీవీ చంద్రమోహన్ రెడ్డి, ఏరువాక కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్, శాస్త్రవేత్త పీవీ సత్యగోపాల్, నరసరావుపేట ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, ప్రకృతిసాగు విభాగం పీడీ డాక్టర్ కె.అమలకుమారి, అభ్యుదయ రైతులు దర్సి శంకరరావు, నిమ్మల శంకరరావు, పోపూరి శివరామకృష్ణ, గంటా రమేష్, జాగర్లమూడి రామారావు, ముద్ర పున్నారావు పాల్గొన్నారు.



సజ్జ పంట క్షేత్రస్థాయి ప్రదర్శనలో రైతు నుంచి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఆదర్శనీయుడు వాల్మీకి మహర్షి

నరసరావుపేట రూరల్: మహాకావ్యం రామాయణాన్ని అందించిన మహాకవి వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ, మానవతా విలువలు ప్రతిబింబించే విధంగా మహాకావ్యం రామాయణాన్ని రచించి సమాజానికి అందించారని తెలిపారు. ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధురకావ్యంగా రామాయణాన్ని రచించి యుగాలు దాటినా నేటికీ సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వాల్మీకి మహర్షి ప్రబోధించిన ఆశయాలను, ఆలోచనలను గుర్తుచేసుకుంటూ సన్మార్గంలో నడవటమే ఆయనకు మనం ఇచ్చే నివాళి అని తెలిపారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్, అదనపు ఎస్పీ(ఏఆర్) వి.సత్తిరాజు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీ రెడ్డి, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

ఎన్ఎంఎంఎస్ నమోదు గడువు 15 వరకు పొడిగింపు

జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ



నరసరావుపేట ఈస్ట్: దేశవ్యాప్తంగా డిసెంబర్ 7వ తేదీన జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్స్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం తెలిపారు. అలాగే పరీక్ష రుసుము చెల్లించేందుకు ఈనెల 16వ తేదీ వరకు గడువు పొడించినట్టు పేర్కొన్నారు. ఈమేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ వెబ్‌సైట్ www. bse. ap. gov. in లో అందుబాటులో ఉందని స్పష్టం చేసారు. ఆన్‌లైన్ అనంతరం సంబంధిత ప్రింటెడ్ నామినల్ రోల్స్‌ను ఈనెల 18వ తేదీ లోగా డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. పల్నాడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ప్రాథమికోన్నత, ఎయిడెడ్, వసతి లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను తప్పనిసరిగా ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అలాగే దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి తగిన విధంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. దరఖాస్తు నమోదులో ఆధార్ కార్డులో ఉన్న విధంగా విద్యార్థి పేరు నమోదు చేయాలన్నారు. దరఖాస్తు చేసేందుకు ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదనీ, పరీక్ష రాసే సమయంలో అన్ని ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలని తెలిపారు. వివరాలకు ప్రభుత్వ వెబ్‌సైట్, డీఈఓ కార్యాలయంలోని డీఎస్ఓ పి.శంకరరాజు (9963192487)ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చేనేత వస్త్రాలు కొనిపించాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి ధూళ్లిపాళ్ల రమాదేవి
- ముగిసిన ఏపీ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలు

సత్తెనపల్లి: చేనేత రంగాన్ని పరిరక్షించాలనే చిత్తశుద్ధి పాలకులకు ఉంటే దేశంలో ప్రతి ఒక్కరితో ఒక జత చేనేత దుస్తులు కొనిపించేటట్లు ప్రభుత్వాలు ప్రచారం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి ధూళ్లిపాళ్ల రమాదేవి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో రెండు రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంగళవారం రెండవ రోజు సభలకు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టా శివ దుర్గారావు, నందం చంద్రకళ, కామార్తి రాజులు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ చేనేత కుటుంబాలలో చదువుకున్న పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక భవన నిర్మాణ కార్మికులగాను, ఇతర వృత్తులలో పని చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి కనీసం నిరుద్యోగ భృతి అయిన ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత వృత్తిలో పనిచేస్తున్న మహిళలకు వచ్చే రూ. 100 ఆదాయంతో ఎలా బతకగలరని ఆమె ప్రశ్నించారు. నేడు రాష్ట్రంలో చేనేత కుటుంబాలు చాలా దుర్భరమైన జీవితాలను గడుపుతున్నాయన్నారు. చేనేత రంగాన్ని పరిరక్షించాలనే చిత్తశుద్ధి ప్రభుత్వాలకు ఉంటే చేనేత 11 రకాల రిజర్వేషన్లను ఉల్లంఘించిన యజమానులపై చర్యలు తీసుకొని, రిజర్వేషన్లు అమలు జరిపించేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల చేనేత కార్మికులంతా మంత్రి లోకేష్‌ను కలసి రిజర్వేషన్లు అమలు జరిపించాలని కోరగా రిజర్వేషన్లు అమలు జరపటం ఎవరివల్లా కాదని మంత్రి లోకేష్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ తగ్గించామని ప్రచారం చేసుకో వటానికి కర్నూలు జిల్లా రాబోతున్నారని, ఆ సందర్భంగా చేనేతపై జీఎస్టీని రద్దు చేయాలని చేనేత కార్మికులంతా కోరాలన్నారు.

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న చేనేత వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపు నిచ్చారు. చేనేత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గంజి మురళి మాట్లాడుతూ చేనేత కార్మికుల పట్ల రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికపై మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు చర్చించి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించి 18 తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు



క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామంలో పోలేరమ్మతల్లి, లక్ష్మీతిరుపతమ్మతల్లి గోపయ్యస్వామి ఆశీస్సులతో గత ఐదు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. విజేతల వివరాలు సీనియర్ విభాగంలో.. ప్రథమ బహుమతి హీరోహోండా డీలక్స్ బైక్‌ను ఏఎస్‌పీ సుంకి సురేంద్రరెడ్డి, సుంకి సాకేతరెడ్డి, సారికారెడ్డిల ఎడ్ల జత (హుజుర్‌నగర్, తెలంగాణ) గెలుచుకుంది. అదేవిధంగా ద్వితీయ బహుమతి రూ.60వేలు పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్లజత (బాపట్ల జిల్లా, బల్లికురవ) గెలుచుకుంది. బాపట్ల జిల్లా, వేటపాలెం, అత్తోటశిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరిల ఎడ్ల జత రూ.40 వేలు, కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన గరికపాటి శ్రీధర్‌కు చెందిన ఎడ్లు రూ.30వేలు, ప్రకాశంజిల్లా బేస్తవారిపేట, జేసీ అగ్రహారం, లక్కు నాగశివశంకర్‌కు చెందిన ఎడ్ల జత రూ.20 వేలు, తెలంగాణ రాష్ట్రం, మఠం పల్లి, గాయం శృజన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిల ఎడ్ల జత రూ.15వేలు, గుంటూరు జిల్లా, కాకుమాను మండలం, కొండబాలవారిపాలెంకు చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షితా చౌదరిల ఎడ్ల జత రూ.12వేలు, కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన అక్కినేని ముకుళ సత్యచౌదరి ఎడ్ల జత రూ.10వేలు, నల్గొండ జిల్లా, గుర్రంపూడ, కొప్పోలు, బతరాజు సత్యనారాయణ ఎడ్ల జత రూ.5116, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్లు రూ.5వేలు బహుమతులు గెలుచుకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

యడ్లపాడు: అనుమానస్పదంగా ఓ యువకుడు ఆనవాళ్లు గుర్తుపట్టని విధంగా మృతి చెంది రోడ్డు పక్కన పడి ఉన్న ఘటన మండలంలో కలకలం రేగింది. మండలంలోని బోయపాలెం – సంగం గోపాలపురం గ్రామాల మధ్య మార్గంలో మంగళవారం ఈ దారుణ ఘటన వెలుగు చూసింది. పోలీసులు మొదట హత్యగా అనుమానించిన పోలీసులు ఘటనా స్థలి పరిశీలిన అనంతరం రోడ్డు ప్రమాదంగా ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోయపాలెం నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఓ యువకుడు ముఖం ఛిద్రమై మృత్యువాత పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న యడ్లపాడు పోలీసులు అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం దారుణంగా ఢీకొట్టడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నందునే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడని, తల పూర్తిగా నుజ్జునుజ్జయి, ఆనవాళ్లను గుర్తించలేని పరిస్థితి ఏర్పడిందని భావిస్తున్నారు. మృతుడికి సుమారు 30 – 35 ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. తెల్లని మేనిఛాయ కలిగి ఉన్నాడు. పసుపు రంగు టీషర్టు, నీలం రంగు షార్టు ధరించి ఉన్నాడు. ముఖ్యంగా, అతని ఎడమ కాలికి నల్ల దారం కట్టి ఉండటాన్ని గుర్తించారు. బహుశా ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కూలీ అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఆనవాళ్ల ఆధారంగా పోలీసులు మండలం పరిధిలోని అన్నివలస కూలీలు పనిచేసే నూలుమిల్లు, క్వారీలు, కంపెనీల్లో గాలింపు చేపట్టారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవాగారంలో భద్రపరిచినట్లు ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి వివరాలు తెలిసినవారు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెలుగుచూడాల్సి ఉంది.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ

ఏపీ పీజీసెట్ పీడబ్ల్యూడీ కేటగిరిలకు కౌన్సెలింగ్ రేపు

ఏఎన్‌యూ(పెదకాకాని): ఏపీ పీజీ సెట్ ప్రవేశాల్లో భాగంగా పర్సన్ విత్ డిజేబిలిటీస్ (పీడబ్ల్యూడి) కేటగిరిలో అడ్మిషన్లకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కౌన్సెలింగ్ కో ఆర్డినేటర్ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ హెల్ప్ లైన్ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.


ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం పర్యటన



తాడికొండ: ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) బృందం రాజధాని అమరావతి పర్యటన వరసగా రెండో రోజు కొనసాగింది. విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్ కె.కన్నబాబు, అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్, అమిలినేని భార్గవ తేజలతో ఏడీబీ- వాటర్- అర్బన్ డెవలప్మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియా సైటో(సీనియర్ డైరెక్టర్), మనోజ్ శర్మ(డైరెక్టర్), సంజయ్ జోషి(ప్రిన్సిపాల్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్), అశ్విన్ హోసూర్ విశ్వనాథ్(సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్) సమావేశమయ్యారు. అనంతరం అమరావతి సచివాలయంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, పురపాలక- పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, పరిశ్రమలు- వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్ ఐఏఎస్‌లను కలిశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఐఏఎస్‌ను ఆయన చాంబర్‌లో ఏడీబీ బృందం కలిసినట్లు సీఆర్డీయే అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి ప్రాజెక్టు పనులలో పురోగతి, ఏడీబీ అందజేస్తున్న ఆర్థిక సహకారం తదితర అంశాలను బృందంలోని సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించారు.

జీవ ఉత్ప్రేరకాల తయారీపై అవగాహన

బ్రెజిల్ బృంద సభ్యులకు శిక్షణ



కొల్లిపర: ప్రకృతి వ్యవసాయం విధానాలు, జీవ ఉత్ప్రేరకాల తయారీపై బ్రెజిల్ బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం కోసం 25 మంది బ్రెజిల్ ప్రతినిధుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అత్తోట, దావులూరిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్ ఆఫీసర్ లక్ష్మనాయక్, బృందం సభ్యులకు బయో ఇన్పుట్ల తయారీ, ఘన జీవామృతం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఏడాదిపాటు పంటలతో భూమిని కప్పి ఉంచడంతో పాటు ఏ గ్రేడ్, ఏ ప్లస్ గ్రేడ్, ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్, ఏటీఎం, పీఎండీఎస్ వంటి మోడల్స్ అనుసరించడం వలన కలిగే అనేక రకాల ప్రయోజనాలను బృంద సభ్యులకు అవగాహన కల్పించారు. దేశీ ఆవు, ప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆవు పేడ, మూత్రంలో అధికంగా లభించే సూక్ష్మ జీవులు, భూమి సారాన్ని పెంచి పంటల ఆరోగ్యాన్ని కాపాడతాయని చెప్పారు. బృందం సభ్యులను ఆవు దగ్గరికి తీసుకువెళ్లి ప్రత్యక్షంగా పేడ, మూత్రం సూక్ష్మజీవుల ప్రాధాన్యంపై వివరించారు. అనంతరం స్వయంగా బృందం సభ్యులు బీజామృతం, ద్రవ, జీవామృతం, విత్తన గుళికల తయారీపై తర్ఫీదు ఇచ్చారు. దావులూరిపాలెంలో న్యూట్రి గార్డెన్, ఫుడ్ బాస్కెట్, ఆరోగ్యం, పోషకాహార కార్యకలాపాల లబ్దిదారులను కలసి నిర్వహణ, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు జాకీర్ హుస్సేన్, కృష్ణారావు, వాణిశ్రీ పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడికి జైలు, జరిమానా

తెనాలిరూరల్: గంజాయి కేసులో నిందితుడికి జైలు శిక్ష జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ తీర్పు నిచ్చారు. రూరల్ ఎస్ఐ ఆనంద్ అందించిన వివరాలు... పట్టణ ముత్తెంశెట్టిపాలేనికి చెందిన గంటినపల్లి పూర్ణ చందు, సీబీఎన్ కాలనీకి చెందిన మొగిలి సాయి, గండికోట గోపి బైక్‌పై వస్తూ 2021 అక్టోబర్ 16న పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా పెదరావూరు జంక్షన్ వద్ద 500 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు. వీరిలో గోపి పరార్ కాగా, మిగిలిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కొద్ది రోజులకు గోపిని అప్పటి సీఐ ఎం. సుబ్రహ్మణ్యం, ఎస్ఐ జి.ఏడుకొండలు అరెస్ట్ చేశారు. ఈ కేసు మంగళవారం విచారించిన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఎ.పవన్‌కుమార్, ముద్దాయిలు పూర్ణచందు, మొగిలి సాయిలకు మూడు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మూడో నిందితుడు గోపిపై కేసు కొట్టివేశారు. ప్రసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

జాతీయ అథ్లెట్ రష్మిశెట్టికి ఘన సన్మానం



లక్ష్మీపురం: జాతీయ అథ్లెటిక్స్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి చెందిన టీటీఐ(రైల్వే టికెట్ ఇన్‌స్పెక్టర్) రష్మిశెట్టి కాంస్య పతకం సాధించడం అభినందనీయమని గుంటూరు రైల్వే డీఆర్ఎం సుథేష్ట సేన్ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రష్మిశెట్టి 64వ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో జావెలిన్ త్రో విభాగంలో కాంస్య పతకం సాధించారు. డీఆర్ఎం మాట్లాడుతూ ప్రధానంగా జాతీయ క్రీడా పోటీలలో గుంటూరు రైల్వే డివిజన్ తరుపున జావెలిన్ త్రోలో పాల్గొని సత్తా చాటిన రష్మిశెట్టిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గుంటూరు రైల్వే డివిజన్ తరుపున క్రీడా, సాంస్కృతిక పోటీలలో ఆసక్తి కనబరిచిన వారికి సహకారం అందిస్తామన్నారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలబాలికల జట్లతో ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం అండర్–19 బాలురు, బాలికల ఉమ్మడి గుంటూరు జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి సుమారు 80 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం కృపాదానం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్యలు ప్రారంభించిన ఈ క్రీడా పోటీలను ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్ఎఫ్ కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి పద్మాకరరావు పర్యవేక్షించారు.

ఎంపికైన బాలురు జట్టు: నాగశరత్, అబ్రామ్, ఎండి అబ్దుల్ సమీర్, కె.జయరామ్, యశ్వంత్, యు హేమంత్రెడ్డి, జె అంకమ్మరావు, త్రినాథ్, ఎస్ వెంకటరాజేష్, ఎల్.లాకేష్, సీహెచ్ అక్ష, కె.వంశీకృష్ణ.

బాలికల జట్టు: ఇ.ప్రశాంతి, శ్రీ చందన, జి.అనిత, జి.మనీష, నేత్ర, పి.పావని, పి.హారిక, బి.శ్రీవల్లి, బి.రష్మి, కె.శ్రావ్య, జి.గౌతమి, పి.జ్యోతి చంద్రిక, పి.అమృతవర్షిణి. ఎంపికైన క్రీడాకారులను ఎస్ఎఫ్ కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి పద్మాకరరావులతో పాటు పీఈటీలు, ఇతర పెద్దలు అభినందించారు.

రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

లక్ష్మీపురం: తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో ఏ తరహాలో కులగణన చేశారో అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా చేసేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు కొత్తపేటలోని జిల్లా సీపీఐ కార్యాయలంలోని మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జనగణనలో కులగణన తక్షణమే చేపట్టాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని కోరుతూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జనగణనలో కులగణన చేయడమే కాకుండా త్వరలో జరుగబోతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన 42 శాతం సీట్లు బీసీలకు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా కులగణన చేపట్టాలని, అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కులగణన జరిగితే బీసీలు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కులగణన కోసం క్షేత్ర స్థాయి నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, బీసీ నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, సీపీఐ నాయకులు జంగాల అజయ్‌కుమార్, ముస్లిం లీగ్ రాష్ట్ర అధ్యక్షుడు బషీర్ అహ్మద్, సీపీఎం జిల్లా నాయకులు పాశం రామారావు, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి ప్రసంగించారు.



మాట్లాడుతున్న కె.రామకృష్ణ. చిత్రంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తదితరులు